ప్రభుత్వ స్థలాలకు త్వరలో ఫెన్సింగ్


మ్యాప్‌ను పరిశీలిస్తున్న విజయేందర్‌రెడ్డి

పేట్‌బషీరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పేట్‌బషీరాబాద్ గ్రామంలోని సర్వేనెంబరు 25/1, 25/2లో ఉన్న యాదిరెడ్డి బండ, రంగారెడ్డిబండ, సయ్యద్ బస్తీ ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. ఆర్‌డీఓ శ్యామ్‌ప్రకాష్, కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం ఆయా స్థలాలను పరిశీలించారు. ఈ సర్వేనెంబర్‌లో హెచ్‌ఎండీఏకు, ఆర్‌జీకె హౌసింగ్ సొసైటీకి ఎంత కేటాయించారని, ఎంత ఆక్రమణకు గురైందని, ఆక్రమణకు గురైన స్థలాల్లో ఎన్ని నిర్మాణాలు వెలిశాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా సర్వేనెంబర్లలో 35 ఎకరాలు హెచ్‌ఎండీఏకు, 7 ఎకరాలు ఆర్‌జీకే హౌసింగ్ సొసైటీకి 2008లోనే వారికి అప్పజెప్పినట్లు రెవెన్యూ అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రెహ్మాన్, ఆర్‌ఐ రేణుక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభం

మియాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎంసీపీఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ రెండు రోజుల సమావేశాలు మియాపూర్ ముజఫర్ అహ్మద్‌నగర్ తాండ్ర రామచంద్ర స్మారక భవనంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అనిల్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంసీపీఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయాల అశోక్‌ఓంకార్ హాజరై మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ అన్ని రాష్ట్రాలకు సమానమైన పద్ధతుల్లో, ఆయా రాష్ట్రాల ఆదాయం ప్రాతిపదికన నిధులు కేటాయించలేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు, బీజేపీకి మద్దతిస్తున్న పార్టీలు ఉన్న రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించాయారని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, కుంభం సుకన్య, వెంకన్న, ఎస్‌రెడ్డి హింసారెడ్డి, పెద్దారపు రమేష్, నజీర్, తుకారంనాయక్, కుమారస్వామి, జబ్బర్‌నాయక్, రమేష్, నర్రా ప్రతాప్, వెంకన్న, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి

జీడిమెట్ల: చిన్నారులపై జరుగుతున్న లైంగిక వేధింపుల నుంచి రక్షించుకోవడానికి ప్రతీ విద్యార్థి పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ అన్నారు. కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు లైంగిక వేధింపులు, వాటి నుంచి ఎలా రక్షించుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు లైంగిక వేధింపుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

వివేకానందనగర్‌లో జడ్‌సీ పర్యటన


సమస్యలను పరిశీలిస్తున్న జడ్‌సీ, కార్పొరేటర్

హైదర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, కార్పొరేటర్ మాధవరం రోజాదేవితో కలిసి మంగళవారం పలు సమస్యలు పరిశీలించారు. మాధవరం కల్వర్టు అప్రోచ్‌రోడ్, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్, సెంట్రల్ మీడియంలో మొక్కలు నాటడం, సీసీరోడ్లు, బోనాల సందర్భంగా చిత్తారమ్మ ఆలయం వద్ద పనులు పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారులు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లను రోజూ శుభ్రం చేయాలి

గచ్చిబౌలి: రహదారులు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల వద్ద ప్రతీరోజు శుభ్రం చేయాలని, వ్యర్థాలను వెంటనే తరలించాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జోన్ పరిధిలోని ఖాజాగూడ, రాయదుర్గం, టెలికాంనగర్, ప్రశాంత్‌నగర్, మసీద్‌బండ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల వద్ద చెత్తాచెదారం విషయం జడ్‌సీ దృష్టికి వచ్చింది. అండర్‌పాస్‌ల వద్ద క్లీన్ చేయడం లేదా అని అధికారులను ప్రశ్నించారు. వెంటనే క్లీన్ చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందిని పర్యవేక్షించాలని సూచించారు. రహదారులపై వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీ కారిడర్‌గా పేరుగాంచిన శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపాలని ఆదేశించారు.

గంజాయి అమ్ముతున్న ముగ్గురి అరెస్టు

రాయదుర్గం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను రాయదుర్గం పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్‌లో ఉండే పెయింటర్ అబ్దుల్‌సాహిద్‌ఖాన్, మహ్మద్ హిబ్రాని, బబ్లురాజ్ కూలీ పనులు చేస్తున్నారు. ముగ్గురికి పనిచేసే చోట పరిచయం ఏర్పడింది. కాగా వీరు పర్వేజ్ అహ్మద్ నుంచి రెండు రోజుల క్రితం గంజాయి కొనుగోలు చేసి గచ్చిబౌలి ఐక్యా వెనుక ఉన్న రోడ్డులో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు రాయదుర్గం పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1800 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా పర్వేజ్ అహ్మద్ ఆంధ్రప్రదేశ్ వైజాగ్ నుంచి గంజాయి తీసుకువచ్చి నగరంలో అమ్ముతున్నట్లు విచారణలో తేలడంతో అతడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపిన వారిపై కేసులు

మియాపూర్: రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్న వారిపై మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. మియాపూర్ దీప్తిశ్రీనగర్ వద్ద మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రాంగ్‌రూట్‌లో వస్తున్న పదిమంది ద్విచక్రవాహన దారులపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. అదేవిధంగా వాహనదారులకు రాంగ్‌రూట్‌లో వస్తే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యాన్ని మెరుగుపరచాలి

షాపూర్‌నగర్, జూలై23(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మహిళలకు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యాన్ని మెరుగుపరచాలని, బస్సు సర్వీసులను పెంచాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఐఎఫ్‌టీయూ, పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతిపత్రం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనూరాధ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, పీఓడ బ్ల్యూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రధాన కార్యదర్శి భారతిలు మాట్లాడుతూ సకాలంలో బస్సులు లేకపోవడంతో మహిళలు అవస్థలు పడుతున్నారని, చిన్నారులు, ఇతరులు ఇబ్బందులు పడుతున్నార్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మాజీ కార్పొరేటర్

హైదర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మాజీ కార్పొరేటర్ జానకిరామరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధి, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. బోస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌వీఎస్ రాజు, రామకృష్ణం రాజు, రాంమోహన్‌రాజు, రాములు, భరత్, నర్సింగరావు, పాండుగరంగయ్య, విజయ కుమార్ వెంట ఉన్నారు.

● **శాతవాహనగర్ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి**

హైదర్‌నగర్ హెచ్‌ఎంటీ శాతవాహననగర్ కాలనీవాసులు పలు సమస్యలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గాంధీని వినతిపత్రం అందజేశారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించారని పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయాలని వారు ఎమ్మెల్యే కోరారు. దీనికి ఎమ్మెల్యే గాంధీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రాంగ్‌రూట్‌లో వెళ్లి బస్సును ఢీకొన్న బైక్.. ఇద్దరి మృతి

చందానగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని అతివేగంతో నిర్లక్ష్యంగా నడిపి ఆర్టీసీ బస్సును ఢీకొట్టి ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోజ్ కుమార్(23) హుడాకాలనీలో నివాసం ఉంటున్నాడు. చందానగర్, శాంతినగర్‌లో నివాసం ఉండే రాజు(26) మదీనగూడలోని జీఎస్‌ఎంమాల్‌లో మేనేజర్లుగా పని చేస్తున్నారు. రాత్రి 12 గంటలకు విధులు ముగించుకుని మియాపూర్ నుంచి చందానగర్‌కు వస్తున్నారు. మియాపూర్ వైపుకు వెళ్లే ఆర్టీసీబస్సును రాంగ్‌రూట్‌లో వెళ్లి అతివేగంగా ఢీకొట్టారు. దీంతో వారు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల పేర్కొన్నారు.

మా కోసం వెతకొద్దు

అక్క తమ్ముడు అదృశ్యం


హారిక, ఫణీంద్ర

రాయదుర్గం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తమ కోసం వెతకొద్దని చెప్పి తమ్ముడిని తీసుకొని ఇంట్లో నుంచి ఓ అక్క, తమ్ముడు వెళ్లిపోయారు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ఈస్ట్‌గోదావరి జిల్లా కాలా మండలానికి చెందిన నరేష్ మజీద్‌బండలోని ప్రభుపాద లేఔట్‌లో నివాసం ఉంటున్నారు. తన అక్క భర్త చనిపోవడంతో వారి కుమార్తె హారిక (20), కుమారుడు ఫణీంద్ర(19)లను తనవద్దే ఉంచుకుని చిన్నప్పటి నుంచి పెంచి చదివిస్తున్నాడు. మేన కోడలు కావడంతో 2022 మే 10వ తేదీన నరేష్ హారికను పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం హారిక బీటెక్, ఫణీంద్ర ఇంటర్ చదువుతున్నారు. ఇదిలా వుండగా ఈ ఏడాది ఫిబ్రవరి 20న హారిక తమ్ముడు ఫణీంద్రతో కలిసి తాము కళాశాలకు వెళ్తున్నామని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయారు. తమ కోసం వెతకొద్దంటూ లెటర్‌రాసిపెట్టారు. అప్పటి నుంచి ఇద్దరి కోసం కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో నరేష్ గచ్చిబౌలి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.22 క్యాప్సూల్.. రూ.44కు అమ్మకం

మెడికల్ దుకాణంపై దాడులు, కేసు నమోదు

హైదరాబాద్‌సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్‌లో యాంటీ ఫంగల్ ఔషధం 'ఐకాన్-200' క్యాప్సూల్స్‌ను ప్రభుత్వం నిర్ణయించిన ధరల కేంటే అధికంగా విక్రయిస్తున్న దుకాణంపై ఔషధ నియంత్రణ అధికారులు దాడులు చేసి యజమానిపై కేసు నమోదు చేశారు. ఓ మెడికల్ దుకాణంలో ఎక్కువ ధరకు మందులు విక్రయిస్తున్నట్లు సమాచారంతో అందడంతో సోమవారం దాడులు నిర్వహించిన అధికారులు మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఔషధ నియంత్రణ సంస్థ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఒక్కో క్యాప్సూల్స్ ధర రూ.22.12 ఉండగా దానిని 44.12 రూపాయలకు విక్రయిస్తున్నట్లు తేలింది. దీంతో మందులను స్వాధీనం చేసుకున్న అధికారులు దుకాణం యజమానిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో అధికారులు తిరుపతి, విజయ్‌గోపాల్, శ్రీకాంత్ ఉన్నారు.

26న కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

పేట్‌బషీరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్ లేల్యాండ్ కంటెనర్, హుండయ్ వెన్‌కారు, హోండా యాక్టీవాలకు ఈ నెల 26న వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు కుత్బుల్లాపూర్ గాయత్రినగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో బహిరంగవేలం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ధరలు అశోక లేల్యాండ్ రూ.19 లక్షల 15 వేలు, హుండయ్ వెన్‌కారు రూ.4 లక్షల 10 వేలు, యాక్టీవా రూ.6 వేల 5 వందలు నిర్ణయించబడిందన్నారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు ప్రభుత్వం నిర్ణయించిన వాహన ధరకు 50 శాతం దరావత్తు చెల్లించాలన్నారు. వేలం పాటలో దక్కించుకున్న వాహనాలకు పాట పాడిన ధరపై అదనంగా జీఎస్టీ విధించి, వాహనాన్ని ఇవ్వనున్నట్లు తెలియజేశారు.